# సాక్షి విశాఖపట్నం

శనివారం । 29 । జూలై । 2023




## న్యూస్‌రీల్

### డీసీసీబీ చైర్మన్‌గా గురువులు ప్రమాణ స్వీకారం నేడు



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోలా గురువులు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు డీసీసీబీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ చైర్మన్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నగర మేయర్ హరివెంకట కుమారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఎంపీపీలు హాజరుకానున్నారు.

### నేడు దక్షిణ, తూర్పు నియోజకవర్గాల సమీక్ష

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని శుక్రవారం నగరానికి చేరుకున్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే తూర్పు, దక్షిణ నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యలపై జరిగే సమీక్షలో ఆమె పాల్గొంటారు. తూర్పు, దక్షిణ నియోజకవర్గ పరిధిలో జీవో నం.72, 36/84, జీవో నం.60 స్టాటస్‌పై చర్చించనున్నారు. సమీక్షలో నియోజకవర్గంలోని ఎమ్మెల్యే, మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, కార్పొరేటర్లతో చర్చించనున్నారు.

### ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సెట్విస్ అధికారులు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిల్లా యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ ఆధ్వర్యంలో స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఎగ్జిబిషన్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటేశ్వర్లు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

### ఐఎస్‌టీడీ కృషి అభినందనీయం



స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను సత్కరిస్తున్న ఐఎస్‌టీడీ ప్రతినిధులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో 'పెర్ఫార్మన్స్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గనైజేషనల్ గ్రోత్' వర్క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభమైంది. ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) విశాఖపట్టణం చాప్టర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో అవసరమైన విజ్ఞానదాయకమైన విషయాలను పూరించడంలో ఐఎస్‌టీడీ కృషిని అభినందించారు. హెచ్‌ఆర్‌డీ జీఎం టీకేఎస్‌ఆర్ ఠాగూర్, హెచ్‌ఆర్ జీఎం కే సంజీవరావు, ఐఎస్‌టీడీ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. సాంబశివరావు, చాప్టర్ చైర్మన్ ఓ.ఆర్.ఎం. రావు, కార్యదర్శి డాక్టర్ హేమ, గీతం ప్రొఫెసర్ సాయి సుధాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ సీఎండీని నిర్వాహకులు సత్కరించారు.

### నేడు ప్రైవేట్ టీచర్లకు అవగాహన

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం (అప్సా) విశాఖ జిల్లా సంఘం ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ఈనెల 29న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కోశాధికారి, ఆరిలోవ భారతీ స్కూల్ కరెస్పాండెంట్ ఎం.వి రావు శుక్రవారం తెలిపారు. ఎన్‌ఏడీ కూడలిలో రామకృష్ణా స్కూల్‌లో ఉదయం 9.30 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లతో అన్ని సబ్జెక్టుల బోధన విధానంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తారన్నారు. బోధనలో సందేహాలు నివృత్తి చేస్తారన్నారు. జిల్లాలో అన్ని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ సదస్సును సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

# మహా యజ్ఞంలా ఇంటింటా ఓటరు సర్వే

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కలెక్టర్, జేసీ ఎస్ఎస్ఆర్-2024 స్వీయ పర్యవేక్షణ
- డోర్ టూ డోర్ సర్వేలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న కలెక్టర్
- ఇప్పటి వరకూ 1.07 లక్షల ఇళ్లల్లో 3.06 లక్షల ఓట్లు పరిశీలన
- 4,775 మంది కొత్త ఓటర్లు దరఖాస్తుల సేకరణ



విశాలాక్షి నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ మల్లికార్జున (ఫైల్)



నెహ్రూ బజార్‌లో ఓటర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జేసీ విశ్వనాథన్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ-2024 కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. ఇంటింటా ఓట్ల పరిశీలన, కొత్త వారి నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, సవరణలు చేపట్టే కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల యంత్రాంగం పక్కాగా చేపడుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్వయంగా కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఇంటింటి తనిఖీలకు వెళ్తూ స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు.

ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం-2024 జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాల్లో చురుగ్గా సాగుతోంది. నెల రోజుల పాటు జరిగే ఈ డోర్ టు డోర్ సర్వేల బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏ)లతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంట్లోనూ కొత్త ఓటర్లు ఉన్నారా.? ఆ చిరునామాతో ఉన్న ఓటర్లు ఉన్నారా.? లేకపోతే ఎక్కడికి వెళ్లారు..? ఆ ఓటును తీసెయ్యాలా.? చిరునామా మార్చు చేయాలా.. ఇలా విభిన్న కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. విశాఖ జిల్లాలో ఉన్న 1945 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 7,61, 667 ఇళ్లున్నాయి. ఇందులో మొత్తం 18,83,861 ఓటర్లున్నారు. 21 నుంచి నిర్వహిస్తున్న సర్వేలో ఇప్పటి వరకూ 1,07,367 ఇళ్లలో ఉన్న 3,06,717 ఓటర్ల వివరాల్ని పరిశీలించారు. ఆగస్ట్ 21వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జిల్లా పరిధిలో ఉన్న ఎన్నికల అధికారులు నిర్విఘ్నంగా నిర్వహించేందుకు చర్యలు అమలు చేస్తున్నారు.

**ఎక్కడా లేని విధంగా...**

సర్వే పూర్తయిన అనంతరం అన్ని నియోజకవర్గాల జాబితాని క్రోడీకరించి అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి నవంబర్ 30 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, వివాదస్పద అంశాలు, ఆరోపణలు తలెత్తకుండా ఉండేందుకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున సంకల్పించారు.

### స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)- 2024 సర్వేలో పరిశీలిస్తున్న అంశాలివే..

- **ఓటర్ల జాబితా**లో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు
- **చనిపోయిన** వారి ఓట్ల తొలగింపు
- **100 సంవత్స**రాలు వయసు పైబడిన వారి గుర్తింపు
- **డోర్ నంబర్లు** లేకుండా ఉన్న, ఒకే డోర్‌నంబర్‌**తో వదుల సంఖ్య**లో ఉన్న ఓట్లపై క్షేత్ర స్థాయి పరిశీలన
- **జిల్లాలో కొత్త**గా ఏర్పాటైన జగనన్న కాలనీ**లకు పోలింగ్‌కేంద్ర**ాలు దూరంగా ఉంటే కొత్తగా **ఆయా ప్రాంతాల్లో** పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిఫార్సులు. దగ్గర్లో పోలింగ్ కేంద్రాలుంటే వాటిలో ఆయా కాలనీల ఓట్ల విలీనం.
- సర్వీసు ఓటర్లు (ఆర్మీ), ఎన్ఆర్ఐ ఓట్ల వివరాల్ని సరి చేయడం
- దీర్ఘ కాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లని వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కొని అక్కడ జాబితాలో చేర్చడం
- ఒక బూత్‌లో సరాసరి 1500కి పైబడి ఓట్లు ఉంటే కొత్త బూత్ ఏర్పాటుకు సిఫార్సు. అందుకు అనువైన ప్రదేశాల గుర్తింపు
- పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డులో మార్పులు, చేర్పులు, తప్పొప్పులు సరి చెయ్యడం.
- ఓటర్ల అభ్యర్థన మేరకు పోలింగ్‌కేంద్రాలు, ఓట్లు ఒక చోట నుంచి మరో చోటుకు మార్చడం మొదలైన వాటిని సర్వేలో పక్కాగా చేపడుతున్నారు.

### నిరంతరం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం



ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమైందే కాబట్టి.. ఒక్కో ఓటును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఎస్ఎస్ఆర్- 2024ని ప్రతి రోజూ ఒక సవాల్‌లా స్వీకరించి పరిశీలనలో ఎన్నికల సిబ్బంది పాల్గొంటున్నాం. ప్రతి ఒక్క ఓటరు తమ వివరాల్ని అందించాలని, అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌వోలకు సహకరించాలని కోరుతున్నా. ఆగస్ట్ 21 వరకూ జరిగే ఇంటింట పరిశీలన అనంతరం.. ఎన్నికల సంఘం ముసాయిదా ప్రకటిస్తుంది. అందులో ఏ అభ్యంతరం ఉన్నా ఓటర్లు నిరభ్యంతరంగా చెప్పొచ్చు. అభ్యంతరాలు, క్లెయిమ్స్ కోసం ప్రత్యేక క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నాం. అక్టోబర్ 28,29, నవంబర్ 18,19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అభ్యంతరాలు తీసుకునే బాధ్యతని బీఎల్‌వోలుకు అప్పగించాం. డిసెంబర్ 26 నాటికి వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లు పరిశీలించి పరిష్కరిస్తాం.

– డా.మల్లికార్జున, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

### ఇప్పటి వరకూ జరిగిన సర్వే వివరాలివీ...

| అసెంబ్లీ నియోజకవర్గం | పోలింగ్ స్టేషన్లు | మొత్తం ఇళ్లు | మొత్తం ఓట్లు | వెరిఫై చేసిన ఇళ్లు | వెరిఫై చేసిన ఓట్లు | ఫారం-6 సేకరణ | ఫారం-7 సేకరణ | ఫారం-8 సేకరణ |
|---|---|---|---|---|---|---|---|---|
| భీమిలి | 335 | 1,37,580 | 3,27,616 | 34,149 | 95,959 | 1082 | 931 | 5,286 |
| విశాఖ తూర్పు | 282 | 1,07,882 | 2,54,889 | 12,634 | 37,388 | 453 | 663 | 829 |
| విశాఖ దక్షిణం | 235 | 96,846 | 2,13,885 | 11,436 | 35,034 | 602 | 646 | 517 |
| విశాఖ ఉత్తరం | 271 | 83,592 | 2,64,253 | 18,499 | 53,058 | 705 | 08 | 1040 |
| విశాఖ పశ్చిమం | 237 | 94,225 | 2,29,020 | 8169 | 16,907 | 553 | 298 | 6183 |
| గాజువాక | 305 | 1,20,961 | 3,12,163 | 7991 | 20,800 | 862 | 1250 | 10,701 |
| పెందుర్తి | 280 | 1,20,581 | 2,82,035 | 14,489 | 47,571 | 518 | 559 | 579 |
| మొత్తం | 1945 | 7,61,667 | 18,83,861 | 1,07,367 | 3,06,717 | 4775 | 4355 | 25,135 |

### ఎప్పటికప్పుడు పార్టీల ప్రతినిధులతో సమావేశం



ఎస్ఎస్ఆర్-2024లో స్వయంగా పాల్గొంటున్నాం. ఒక బృహత్తర యజ్ఞంలా వందల మంది అధికారులు చేపడుతున్న సర్వే సహకారంతో పూర్తి చేసిన డ్రాఫ్ట్... ఎలాంటి విమర్శలకు తావివ్వకూడదన్నదే మా ముఖ్య ఉద్దేశం. ఓవైపు సర్వే చేపడుతూ మరోవైపు రెండు ఆదివారాలు, రెండు శనివారాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఏ ఒక్కరి ఓటు పోకుండా ఉండాలనే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఒక్క ఓటు మిస్ అయినా.. దొంగ ఓటుగా కనిపించినా.. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

– కేఎస్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

### అధికారులంతా సమన్వయంతో..



పారదర్శకమైన ఓటరు జాబితా తయారు చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేస్తున్నాం. కలెక్టర్ ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకాధికారుల్ని నియమించారు. ఏ సమస్య వచ్చినా అధికారులకు ఓటర్లు తెలియజేయవచ్చు. ఓటరు నమోదులో ఏదైనా సమస్య తలెత్తితే ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. కలెక్టరేట్, జిల్లా ఎన్నికల అధికారి కార్యాయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 0891-2789798 నంబర్‌కు లేదా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.

– ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి

## విద్యుత్ సమస్య తలెత్తితే ఫిర్యాదు చెయ్యండి

- వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు
- 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు అదనంగా పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు
- ప్రజలకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాలు, కనెక్షన్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజినీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/టెక్నికల్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. తుపాను లేదా భారీ వర్షాల వలన విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకూ 24/7 ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని సీఎండీ పృథ్వీతేజ్ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు వివిధ సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారులకు సీఎండీ సూచించారు.

సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, ఏలూరు - 9440812702
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, రాజమహేంద్రవరం - 9440812583
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విశాఖపట్నం - 9440812487
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, విజయనగరం- 9440812447
సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, శ్రీకాకుళం - 9440812386

## ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు కలిగిన వారు పదో తరగతి ప్రవేశానికి అర్హులన్నారు. ఇంటర్మీడియెట్ కోర్సులో ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఆగస్టు 31 వరకు గడువు ఉందని, ఆసక్తి ఉన్న మరిన్ని వివరాల కోసం సమీపంలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

## నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ కీలకం

సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి, విశాఖపట్నం: ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధిలో హెచ్‌ఆర్ నిపుణుల పాత్ర కీలకమని సీఐఐ ఏపీ వైస్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో హెచ్‌ఆర్ కాంక్లేవ్ పేరిట సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కోవిడ్ అనంతరం ఏడాది తర్వాత ఐటీ సంస్థల మానవ వనరుల నిపుణులు తమ ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు రప్పిస్తున్నారన్నారు. వారిలో నైపుణ్యాభివృద్ధి, వైవిధ్యం, భద్రతలకు వీలుగా హెచ్‌ఆర్ నిపుణులు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఐఐ పూర్వ చైర్మన్ డి.రామకృష్ణ మాట్లాడుతూ వివిధ కంపెనీలు వేగంగా మార్పులను ఎదుర్కొంటున్నందున వాటి నిర్వాహకులు సంస్థల అభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని చెప్పారు. ఇందులో మార్పు, సంస్కృతి విజయానికి కీలకమన్నారు. ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, సీఈవో గౌతమ్ గుప్తా మాట్లాడుతూ పని సంస్కృతి చాలా ముఖ్యమని, కాలానుగుణంగా సందర్భానుసారం ఉద్యోగులను ప్రసంశించడం, వారిని గుర్తించడం మంచి ఫలితాలనిస్తుందన్నారు. సీఐఐ విశాఖ హెచ్‌ఆర్ ప్యానెల్ కన్వీనర్, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఠాగూర్ మాట్లాడుతూ సానుకూల దృక్పథం మంచి ఫలితాలను, సత్సంబంధాలను పెంపొందిస్తుదన్నారు. వ్యాపార ప్రక్రియల్లో సాంకేతికతను వినియోగించుకోవడం చాలా ముఖ్యమన్నారు. హైదరాబాద్ టీసీఎస్ హెచ్‌ఆర్ హెడ్ శ్రీకాంత్ సూరంపూడి మాట్లాడుతూ తమ హెచ్‌ఆర్ టెక్నాలజీని ఎలా డిజైన్ చేయాలి, ఎలా ఉపయోగించాలి అనే అంశాల్లో ప్రజలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. వ్యాపార విజయానికి ఉద్యోగి అనుభవం కీలకమని ఆయా సంస్థలు తెలుసుకుంటున్నాయన్నారు. సదస్సులో పీపుల్ అండ్ కల్చర్ హెడ్ సాలినీ నాయర్, అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి అజిత్‌నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి



సమీక్షలో పాల్గొన్న జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అల్లూరి ఎస్పీ తుహిన్ సిన్హా, అధికారులు

అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశం

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, నదుల్లో వరద ప్రవాహం, సహాయ పునరావాస కార్యక్రమాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, డీఆర్వో ఎస్ శ్రీనివాసమూర్తి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే కంట్రోల్ రూమ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

## కాలేయ వ్యాధిపై అవగాహన అవసరం



బెలూన్‌లు ఎగరవేసి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు

బీచ్ రోడ్డు(విశాఖ తూర్పు): కాలేయ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కే బీచ్ వద్ద లివర్ వాక్‌థాన్ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను బెలూన్లు ఎగురు వేసి సన్యాసిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీర భాగాల్లో ముఖ్యమైన కాలేయాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఏకో వైజాగ్‌కు జీవీఎంసీ కృషి చేస్తుందన్నారు. కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాక్సినేషన్ కోసం ఈ లివర్ వాక్ నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 683 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డాక్టర్ పెద్ద వీర్రాజు, డాక్టర్ సుజాత, డాక్టర్ వంశీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### శంకర్ ఫౌండేషన్‌లో అందుబాటులోకి ఆధునిక పరికరం

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోటలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో అత్యాధునిక ఎస్ఎస్-ఓసీటీ(స్వెప్ట్ సోర్సు ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ) పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆస్పత్రి విట్రియో రెటీనా సర్జన్ డాక్టర్ జగన్నాథ్‌కుమార్ చల్లా శుక్రవారం ఈ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథ్ చల్లా మాట్లాడుతూ కంటి నిర్మాణం, కంటిలోతైన పొర, రెటీనా, కార్నియా తదితర వాటిని ఇమేజింగ్‌కి ఈ పరికరాన్ని వినియోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు



మంత్రి అమర్‌నాథ్‌కు ఏర్పాట్ల గురించి వివరిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): జీవీఎంసీ 45వ వార్డు పోర్టు ఆస్పత్రి సమీపంలో రహేజా గ్రూప్ సుమారు రూ.600 కోట్లతో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు వచ్చే నెల 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోర్టుకు చెందిన సుమారు 17 ఎకరాల్లో నిర్మించనున్న ఈ మాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అతి పెద్దదిగా నిలువనుందని తెలిపారు.

సుమారు 280కు పైగా కంపెనీలకు చెందిన ఔట్‌లెట్స్ ఈ మాల్‌లో ఉంటాయన్నారు. ఇందుకు అవసరమైన అనుమతులను ప్రభుత్వం నుంచి రహేజా గ్రూప్ యాజమాన్యం ఇప్పటికే తీసుకుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. 24 నెలల్లో ఈ మాల్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. విస్తరణలో భాగంగా భవిష్యత్తులో ఇదే ఆవరణలో ఒక ఐటీ టవర్‌ను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి రహేజా గ్రూప్‌ను కోరారని, అందుకు వారు అంగీకరించారని మంత్రి తెలిపారు. విశాఖను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. అలాగే అదే రోజున జీవీఎంసీకి చెందిన సుమారు రూ.138 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోకు పాల్గొన్నారు.

### నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

సీతమ్మధార : జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు శనివారం, ఆదివారం కూడా పనిచేస్తాయని ఏపీఈపీ డీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ కార్యాలయాలతోపాటు సెక్షన్ కార్యాలయాలు, ఏటీపీ కేంద్రాల్లోనూ బిల్లులు చెల్లించవచ్చన్నారు.



# విధి నిర్వహణలో అలసత్వం వద్దు

**ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు అనకాపల్లి ఎస్పీ సూచన**



అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణకు గౌరవ వందం చేస్తున్న కైలాసగిరి ఏఆర్ పోలీసులు

**ఆరిలోవ:** నిందితులను కోర్టులకు తరలించినప్పుడు, కోర్టుల నుంచి జైలుకు తరలించినప్పుడు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు పకడ్బందీగా ఎస్కార్ట్ విధులు నిర్వర్తించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. విశాలాక్షినగర్‌లో కై లాసగిరి ఏఆర్ పోలీస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పోలీస్ మైదానంలో పరేడ్ కమాండర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో సిబ్బంది కవాతు చేస్తూ ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలకు పాల్పడిన అంతర్ జిల్లాలకు చెందిన నిందితులను కోర్టులకు తరలించేటప్పుడు మరింత జాగరూకతతో వ్యవహరించాలన్నారు. అనంతరం నార్కొటిక్స్ శిక్షణ పూర్తి చేసుకుని ఇక్కడకు తీసుకురానున్న రెండు పోలీస్ జాగిలాలకు వసతి ఏర్పాట్లను పరిశీలించారు. ఆ జాగిలాలకు శరీర దారుఢ్యం కల్పించి, నేరస్తులను గుర్తించడంలో మరింత శిక్షణ ఇవ్వాలని డీఎస్పీ పి.నాగేశ్వరరావుకు ఆదేశించారు. ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# గోవా టు శ్రీకాకుళం

- విశాఖ మీదుగా మద్యం తరలిస్తున్న ముఠాకు చెక్
- రైల్వేస్టేషన్‌లో అక్రమ మద్యం పట్టివేత
- ముగ్గురి అరెస్ట్.. 295 బాటిళ్ల స్వాధీనం

**దొండపర్తి:** గోవా టు శ్రీకాకుళం వయా విశాఖపట్నం.. ఇది కొత్తగా స్టార్ట్ చేసిన బస్ సర్వీస్ కాదు.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అసలే కాదు.. అక్రమంగా రాష్ట్రాన్ని మద్యాన్ని తీసుకువచ్చేందుకు స్మగ్లర్లు ఎంచుకున్న రూటు. గోవా మద్యాన్ని దర్జాగా రాష్ట్రాలు దాటించిన ముఠాకు విశాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు చెక్ పెట్టారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మహారాణిపేట సెబ్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లాకు చెందిన పాదిలాపు సత్యనారాయణ గోవాలో మద్యం షాపు నుంచి బాటిల్ రూ.26కు కొనుగోలు చేసి.. ఇక్కడి తీసుకువచ్చి తన సహచరుడైన విజయనగరం జిల్లాకు చెందిన ధనుంజయకు బాటిల్ రూ.92కు విక్రయిస్తుంటాడు. దాన్ని ధనుంజయ శ్రీకాకుళం జిల్లాకు చెందిన గొర్లె లక్ష్మీనాయుడుకు రూ.100 అమ్ముతుంటాడు. లక్ష్మీనాయుడు తన గ్రామంలో ఒక్కో బాటిల్ రూ.120కు విక్రయిస్తుంటాడు. ఇలా అక్రమ మార్గంలో మద్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఈ ముఠాకు విశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు ఆధ్వర్యంలో అడ్డుకట్ట వేశారు. ఎప్పటిలాగే సత్యనారాయణ గోవాలో మద్యాన్ని కొనుగోలు చేసి అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖకు తీసుకువచ్చాడు. విశాఖ రైల్వేస్టేషన్‌లో వీరు సరుకు మార్చుకుంటుండగా మహారాణిపేట సెబ్ సీఐ జగదీశ్వరరావు బృందం దాడులు చేసిన వారి పట్టుకుంది. వారిని అదుపులో తీసుకుని వారి నుంచి 295 గోవా మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు విశాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉంటే మహారాణిపేట స్టేషన్ పరిధిలోని దాడుల్లో పట్టుబడిన మద్యాన్ని అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. దాడుల్లో సీజ్ చేసిన నాలుగు వాహనాలను వేలం వేశారు.



స్వాధీనం చేసుకున్న గోవా మద్యం బాటిళ్లతో సెబ్ అధికారులు

## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన కోలా గురువులు



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజనీని శుక్రవారం వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో బస చేసిన ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు.

– మహారాణిపేట

# మురుగునీటి శుద్ధి కర్మాగార పనులు వేగవంతం



నరవ చెరువు అభివృద్ధికి సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

**డాబాగార్డెన్స్:** నరవలో మురుగునీటి శుద్ధి కర్మాగార పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కర్మాగారం, అమృత్ పథకంలో ఎంపిక చేసిన నరవ చెరువును శుక్రవారం కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరవలో నిర్మిస్తున్న 108 ఎంఎల్‌డీ మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఫేజ్–1 పనులు దాదాపు పూర్తయ్యాయని, ఫేజ్–2 పనులు 50 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. పెందుర్తి, గాజువాక తదితర ప్రాంతాల్లోని గృహ, వాణిజ్య, పరిశ్రమల నుంచి వచ్చే ఘన ద్రవ వ్యర్థాలను ఈ ప్లాంట్‌లో శుద్ధి చేసి.. ఆ నీటిని హెచ్‌పీసీఎల్, స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా చేస్తామన్నారు. ప్లాంట్‌లో రోడ్లు, పారిశుధ్య నిర్వహణతో పాటు పిచ్చి మొక్కలు తొలగించి గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో 10 మొక్కలు నాటారు. తర్వాత నరవ చెరువును సందర్శించి.. చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. చెరువుకు రక్షణ గోడ నిర్మించడంతో పాటు ఆకర్షణీయమైన మొక్కలతో పార్క్‌ను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవిని ఆదేశించారు. పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్, స్మార్ట్‌సిటీ మేనేజర్ ఆనంద్, టాటా కన్సల్టింగ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఆర్ నిబంధనలు పాటించాల్సిందే..



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్

**దొండపర్తి:** ఓటరు జాబితా మార్పులు చేర్పుల విషయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఎస్ఆర్) నిబంధనలను పాటించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ జిల్లాలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఫారం 6, 7, 8లలో ఉన్న మార్పులు, చేర్పులకు సంబంధించి కచ్చితంగా నివేదిక రూపొందించాలని చెప్పారు. నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాల నివేదికలను పోలీసు అధికారుల నుంచి తీసుకొని పొందుపరచాలని సూచించారు. ఈవీఎంలు వీవీ ప్యాడ్‌లను సిద్ధం చేసి వాటి నివేదిక అందజేయాలన్నారు.

హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ కార్యక్రమం ఆన్‌లైన్‌లో రానిపక్షంలో ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలన్నారు. దానికి సంబంధించి జిల్లా ఎన్‌రోల్మెంట్ అధికారి అయిన జిల్లా కలెక్టర్లు తగిన నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తయిన తర్వాత ఎపిక్ కార్డుల ముద్రణకు నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్డీసీలు, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన సేవలందించండి

**హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నివాస్**

**పరవాడ:** వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జె.నివాస్ సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ గదిని పరిశీలించారు. ఆస్పత్రికి సరఫరా చేస్తున్న మందులు, నాడు–నేడు పథకంలో చేపట్టిన మరమ్మతులపై వివరాలు సేకరించారు. జీవో 143 ప్రకారం ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉన్నారా లేదా అన్న వివరాలను వైద్యాధికారి క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న రోగులకు ప్రతి నెలా పరీక్షలు జరిపి మందులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలను పొందాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. అనకాపల్లి జాయింట్ కలెక్టర్ ఎం.జహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎంహెచ్‌వో ఎ.హేమంత్‌కుమార్, వాడచీపురుపల్లి వైద్యాధికారి కనకప్పారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నివాస్

# శరవేగంగా క్యాజువాల్టీ నిర్మాణం

**మహారాణిపేట:** కేజీహెచ్‌లో రెండో క్యాజువాల్టీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తున్న కేజీహెచ్‌కు క్రమంగా రోగుల సంఖ్య పెరుగుతుండడంతో.. ప్రస్తుతం క్యాజువాల్టీలో పడకలు సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో మరో క్యాజువాల్టీ నిర్మించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆమోదముద్ర వేశారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షల నిధులను మంజూరు చేయడంతో టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్సార్ నిధులతో 24/7 పని చేసే క్యాజువాల్టీని కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్నారు. రూ.15 లక్షలతో లేబొరేటరీ ఏర్పాటు చేస్తున్నారు. మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ కూడా సిద్ధం చేస్తున్నారు. సెంట్రల్ ఎయిర్ కండీషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ నాయుడు ఆధ్వర్యంలో డీఈ మన్మధరావు ఈ పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం టైల్స్ పనులు జరుగుతున్నాయి.

# యువకుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

**సీతమ్మధార:** తాటిచెట్లపాలెంలోని విశాఖ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ.. కైలాసపురానికి చెందిన కిరణ్(22)తో పాటు కాపు శివ(నందగిరినగర్), పి.శ్రీనివాస్(పొట్టి శ్రీను–చెక్కుడురాయి బిల్డింగ్), రౌతు సురేష్ (కైలాసపురం) గురువారం విశాఖ రెస్టారెంట్ అండ్ బార్‌కు వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి మద్యం సేవిస్తున్నారు. ఆ సమయంలో కిరణ్.. శివను రెచ్చగొట్టేలా మాట్లాడటంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శివ మరుగుదొడ్డిలోని ఇనుప పుల్లను తీసుకొచ్చాడు. మిగతా ఇద్దరు సహకారంతో కిరణ్‌ను పొడవడంతో కుప్పకూలిపోయాడు. అతన్ని వదిలేసి ముగ్గురూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి మద్యం సేవించేందుకు బార్‌కు వచ్చిన ఓ యువకుడు ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులను అరెస్ట్ చేశారు. సమాచారం ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా.. సంఘటన జరగకముందు కిరణ్ వద్ద చాకు ఉందని.. ఇప్పుడు లేదని శివ చెబుతున్నాడు. కిరణ్‌పై మూడు కేసులు నమోదై ఉన్నట్లు తెలిసింది.

## వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**మహారాణిపేట(విశాఖ దక్షిణ):** వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు పోస్టుల భర్తీకి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో వివిధ ప్రోగ్రాంల కింద పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్(ఒక పోస్టు), డాట్స్, టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్(ఒక పోస్టు), పీపీఎం కోఆర్డినేటర్(ఒక పోస్టు), టీబీ హెల్త్ విజిటర్(ఒక పోస్టు), అకౌంటెంట్(ఒక పోస్టు), డెంటల్ మెడికల్ ఆఫీసర్స్(రెండు పోస్టులు), ఐసీటీసీ కౌన్సిలర్(రెండు పోస్టులు), ఏఆర్‌టీ కౌన్సిలర్(ఒక పోస్టు), ఏఆర్‌టీ డేటా మేనేజర్(ఒక పోస్టు), ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్(2 పోస్టులు), బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్(ఒక పోస్టు), డేటా మేనేజర్(ఒక పోస్టు), స్టాఫ్ నర్స్(మూడు) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేస్తున్నారు. ఒక సంవత్సరం కాల పరిమితితో పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చేనెల ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https// visakhapatnam. nic. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

**మహారాణిపేట:** ఇటీవల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల పేరుతో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు.. నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏ క్యాడర్ ఉద్యోగం భర్తీ చేయాలన్నా నోటిఫికేషన్ ఇస్తామని, తర్వాత మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. ఇతర మార్గాల్లో ఉద్యోగం పొందే అవకాశం లేదని.. ఈ విషయంలో నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా డబ్బులు ఇచ్చి మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# రోల్‌బాల్ పోటీలకు 'వైశాఖీ స్పోర్ట్స్' క్రీడాకారులు

**మురళీనగర్:** మురళీనగర్ స్కేటింగ్ పార్కులో శిక్షణ పొందుతున్న రోల్‌బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29, 30 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు కోచ్ పి. సంతోష్ తెలిపారు. వీరంతా శుక్రవారం గుంటూరు బయలు దేరారు. వీరిని పార్కు కార్యదర్శి నాగరాజు, మల్లా రామకృష్ణ తదితరులు అభినందించారు.



రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన మురళీనగర్ క్రీడాకారులు

# 'నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు తప్పనిసరి'

**సీతంపేట:** బాలల హక్కుల పరిరక్షణలో మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ల పాత్ర కీలకమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని సీతమ్మధార ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోలు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ల వ్యవస్థలపై శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్‌లో ఫీజుల వివరాలు తెలుసుకోవడం తమ హక్కు అని తెలిపారు. నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు బహిర్గతం చేయాలని, అలా చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం కేటాయించిన సీట్ల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు. సీతమ్మధార ఎంఈవో డి.రామారావు, ఎంఈవో–2 బాలామణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'పటిష్టంగా సైనిక ఉద్యోగులకు డిగ్రీ ప్రదానం'

**ఏయూక్యాంపస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం అధికారులతో పలు రాష్ట్రాల రాజ్ సైనిక్ బోర్డు, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. వర్చువల్ విధానంలో శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్ పాల్గొన్నారు. దేశ రక్షణ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు విద్యార్హతలు, నైపుణ్యాలు, వృత్తి అనుభవాలను పరిగణలోనికి తీసుకుని వారికి డిగ్రీలను ప్రదానం చేసే దిశగా మరింత పటిష్టంగా పనిచేయాలని నిర్ణయించారు. దీని కోసంఆన్‌లైన్‌లో సమాచారం పంచే ప్రక్రియను తయారు చేశారు. సైనికోద్యోగులకు ఉన్నత విద్యను అందించే విధంగా ఏయూ చేపడుతున్న కార్యక్రమాలపై సైనికాధికారులు సంతోషం వ్యక్తం చేశారు. సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డీన్ ఆచార్య కె.నిరంజన్, పరీక్షల విభాగం డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య భాస్కర రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

# క్యాంపస్ ఇంటర్వ్యూలో 'గైస్' బాలికల సత్తా

**మురళీనగర్:** గ్రాసిమ్ ఇండస్ట్రీస్(బిర్లా పెయింట్స్ కంపెనీ) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గైస్ బాలికలు సత్తా చాటారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో శుక్రవారం రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించగా.. 8 మంది బాలికలు ఎంపికయ్యారు. కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్స్, ఆయిల్ టెక్నాలజీ విభాగాల నుంచి ఇద్దరు చొప్పున, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వీరికి రూ.3.30లక్షల వార్షిక వేతనాన్ని కంపెనీ చెల్లించడమే కాకుండా ఫుడ్, బస్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రామకృష్ణ, కంపెనీ ప్రొడక్షన్ డిపార్టుమెంట్ హెడ్ జి.శంకర్ నారాయణ, ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.శివశంకర్, హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎ.ప్రభాకరన్, కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి(టీపీవో), ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదర్, ఏటీపీవో కుమార్‌లు బాలికలను అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన బాలికలతో గైస్ అధ్యాపకులు

# ఏడున్నర గంటల ఆలస్యంగా బయల్దేరిన తిరుమల

**తాటిచెట్లపాలెం:** విశాఖపట్నంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం–కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ సుమారు ఏడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది. లింక్ రైలు రాక ఆలస్యం కారణంగా విశాఖ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు. ఈ విషయం తెలియక ఆయా స్టేషన్లలో వేచి ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



దువ్వాడ స్టేషన్‌లో వేచి ఉన్న తిరుమల ప్రయాణికులు

# కారును ఢీకొన్న 'పోలీస్' కారు

**సీతమ్మధార:** మద్యం మత్తులో ఓ కారు డ్రైవర్ అతివేగాన్ని నడుపుతూ మరో కారును ఢీకొట్టాడు. వివరాలివీ.. నక్కవానిపాలెం 60 అడుగు రోడ్డు నుంచి ఏపీ 31 సీఈ 3344 కారు హెచ్‌బీకాలనీ వైపు మలుపు తిరుగుతోంది. అదే సమయంలో హెచ్‌బీకాలనీ నుంచి వచ్చిన ఏపీ 31 ఈఎం 3726 కారు(పోలీస్ బోర్డు) 3344 నంబర్ గల కారును ఢీకొట్టింది. పోలీస్ బోర్డు ఉన్న కారు డ్రైవర్ సందీప్ పూటుగా మద్యం సేవించి ఉన్నాడు. ఈ ఘటనలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. 3726 కారు ఎవరిదని పోలీసులు డ్రైవర్‌ను ప్రశ్నించగా.. తాను సీఐ విజయ్‌కుమార్ కుమారుడినని చెప్పాడు. వెంటనే సీఐకి ఫోన్ చేస్తుండగా వద్దంటూ బతిమలాడాడు. దీంతో డ్రైవర్‌ను ఎంవీపీస్టేషన్‌ను తరలించారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు